క్లుప్తంగా

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బుచ్చినాయుడుకండ్రిగ: గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, సమపోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పించాలని మాతా శిశు రక్షణ టాస్క్‌ఫోర్స్ కమిటీ తిరుపతి జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్రకుమార్ తెలిపారు. గురువారం వారు మండలంలోని గాజుల పెళ్లూరు, ఆలత్తూరు గ్రామ సచివాలయాల్లోని వెల్‌నెస్ కేంద్రాలను సందర్శించారు. మాతా శిశు సేవలు, రక్తహీనతకు గురవుతున్న కారణాలపై వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. డీపీహెచ్‌ఎన్‌ఓ ఇన్‌చార్జ్ ప్రకాష్, వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు పంటల సస్యరక్షణపై అవగాహన

నాగలాపురం: పట్టణంలోని టీఆర్‌ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం మండలంలోని రైతులకు స్పిక్ కంపెనీ ఆధ్వర్యంలో పంటల సస్యరక్షణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రీజనల్ ఆఫీసర్ సి.గంగాధరం తెలిపారు. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. వరి, వేరు శెనగ, చెరుకు, మామిడి, పూలతోటల సాగులో ఎరువుల వినియోగం, మందులు పిచికారీ, యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. సదస్సు అనంతరం రైతులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏర్పేడు: మండలంలోని గోపాలపురం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. ఆయన కథనం.. తిరుపతికి చెందిన శ్రీకాంత్(32), పురుషోత్తం(26) ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తికి వెళుతున్నారు. మార్గమధ్యంలో గోపాలపురం వద్ద ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫిబ్రవరిలో కుంభాభిషేక వేడుకలు

నగరి: నేత్ర దేవతగా ప్రసిద్ధి చెందిన దేశమ్మ దేవత నూతన ఆలయ కుంభాభిషేక వేడుకలు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ చైర్మన్ వేణుబాబు, ఈట రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ పునఃనిర్మాణ జీర్ణోద్ధరణ కుంభాభిషేకం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. వేలూరు స్వర్ణ ఆలయ నిర్మాణకర్త నారాయణి అమ్మన్ ఆశీస్సులతో మంత్రి రోజా సమక్షంలో జ్యోతిశాస్త్ర పండితులు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు కుంభాభిషేక వేడుకలు నిర్వహిస్తారన్నారు. పాలక మండలి సభ్యులు, అర్చకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తారన్నారు. చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణ, హోమసామగ్రి సరఫరాకు ఆసక్తిగల వారు ఈ నెల 20న ఉదయం 11 గంటలకు టెండ రులో పాల్గొనాలన్నారు. డిపాజిట్ ఫారాలు శుక్రవా రం నుంచి తమ కార్యాలయంలో పొందవచ్చన్నారు.

క్యాలెండర్ విడుదల


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో గురువారం రాష్ట్ర టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ అసోసియేషన్ 2024 క్యాలెండర్‌ను సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఆనందరావు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ విడుదల చేశారు. ఆనందరావు మాట్లాడుతూ పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ చురుకైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ హనుమంతరావు, సుబ్రమణ్యం, గుణవర్ధన్, వికాష్, ప్రసాద్‌రావు, నాగరాజు, రాజేంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే వేడుకలకు ఎన్బీకేఆర్ విద్యార్థి


విద్యార్థి అభినయ్ కీర్తన్‌పాల్

కోట: విద్యానగర్ ఎన్బీకేఆర్ ఐఎస్టీ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అభినయ్ కీర్తన్‌పాల్ జనవరి 26న న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎన్‌సీసీలో ప్రతిభ కనబరిచిన అభినయ్ కీర్తన్‌పాల్ రిపబ్లిక్‌డే వేడుకలకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విద్యార్థిని అభినందించినట్లు తెలిపా రు. ఎన్‌సీసీ అధికారి మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

అవ్వా,తాతల మోములో ఆనందం



సత్యవేడు: పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆదిమూలం, నాగలాపురం: పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: సామాజిక పింఛను సొమ్ము పెంపు విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాడంతో అవ్వ,తాతల మోములో చిరునవ్వులు పూస్తున్నాయని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 621 కొత్త పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఏడు మండలాల పరిధిలో వివిధ రకాల పింఛన్లు 44,041 మందికి అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో నెలవారీ పింఛను మొత్తాన్ని రూ.3వేలకు పెంచినన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇలాంటి మేలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, వ్యవసాయ కమిటీ చైర్మన్ కె.శ్యాంప్రసాద్ రెడ్డి, రమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ పీఎంకే బాబు అధ్యక్షతన రూ.3 వేల పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం74 కొత్త పింఛన్లు మంజూరు అయినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ సుధ, ఎంపీపీ సింధూ శ్యామ్, వైస్ ఎంపీపీ కుమారి, తహసీల్దారు పసన్న కుమార్, నాయకులు దేశప్ప, కులశేఖర్ రెడ్డి, ఉదయ్ కుమార్, ధనరాజ్, అలగేశన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు అభివృద్ధి


పాతగుంట రోడ్డుకు మరమ్మతులు

రేణిగుంట(శ్రీకాళహస్తి): ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణరోడ్లకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సొంత నిధులు వెచ్చించి బాగు చేయించారు. పల్లంపేట నుంచి శ్రీకాళహస్తి మండలం పాతగుంట వైపు వెళ్లే తారురోడ్డు ఓ కాజీవే సమీపంలో నీటి ప్రవాహనికి చాలాభాగం కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఈసమస్యను ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన వెంటనే స్పందించి సొంత నిధులు వెచ్చించి ట్రాక్టర్లతో గ్రావెల్ తోలించి జేసీబీల సాయంతో బాగు చేయించారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే సూరావారిపల్లి, యార్లపూడి, మంగళగుంట గ్రామాల ప్రజలకు మార్గం సుగమం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

హుండీ ఆదాయం రూ.99 వేలు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

నారాయణవనం: మండలంలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలోని శ్రీకామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ 99,169 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ సుబ్రమణ్యం, ఈవో కృష్ణనాయక్ తెలిపారు. గురువారం ఉదయం ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో కానుకలను లెక్కించారు. 5 నెలలకు గాను రూ 99,169 లభించిందని వారు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: మండలంలోని ముడియూరులో శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ. చలపతి రాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు ముడియూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించనున్నారని ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకే ఆడుదాం-ఆంధ్ర


బుచ్చినాయుడుకండ్రిగలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


నాగలాపురం: టీషర్ట్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం


సత్యవేడు: క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

నాగలాపురం: గ్రామీణ యువకుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే ఆడుదాం-ఆంధ్రా పోటీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ పీఎంకే బాబు అధ్యక్షతన గురువారం ఆడుదాం-ఆంధ్రా టీ షర్ట్‌లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ సుధా చిన్నదొరై, ఎంపీపీ సింధూ శ్యామ్, నాయకులు ఎల్.సురేష్, దేశప్పన్, అలగేశన్, కులశేఖర్ రెడ్డి, వీఆర్వో నాగభూషణం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు గొప్ప అవకాశం

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామీణ క్రీడాకారులకు తమలోని సత్తాను చాటుకునేందుకు ఆడుదాం..ఆంధ్ర గొప్ప అవకాశమని వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి తెలిపారు. గురువారం పార్లపల్లె క్రీడా మైదానంలో సర్పంచ్ వెంకటస్వామి, గ్రామ కార్యదర్శి స్వర్ణమంజులతో కలసి క్రీడా కిట్లను పంపిణీ చేసి, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాలతో మానసికోల్లాసంతోపాటు ఆరోగ్యంగా ఉండవచ్చని నాయకులు చలపతి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పోటీ పడాలి

సత్యవేడు: క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ఆడాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం-ఆంధ్రలో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన పర్యవేక్షించారు. మండల పరిధిలో పెద్ద ఈటిపాకం, రాజగోపాలపురం, పీపీ పురం సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు ఇరుగుళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో, దాసుకుప్పం, మదనంబేడు క్రీడాకారులకు సత్యవేడు ఉనత్న పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు.14మాచ్‌లలో 154మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈఓపీఆర్డీ ముని రవికుమార్, పీడీలు మురళి, అపర్ణ, గ్రేస్ ప్రతిమ, ఢిల్లీరాణి, స్వర్ణ, మణి, సతీష్, నాగరాజు, పయని బాబు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో వ్యాస రచన పోటీలు



వరదయ్యపాళెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సీసీఆర్) ఆధ్వర్యంలో 'అవినీతిరహిత భారతదేశం ' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీసీఆర్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. అవినీతిని అంతం చేసేందుకు విద్యార్థి దశ నుంచే ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్లబోధన


డైట్ మోడల్ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈవోలు విజయేంద్రరావు, డాక్టర్ శేఖర్

కార్వేటినగరం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీఈఓలు విజయేంద్రరావు, డాక్టర్ శేఖర్ అన్నారు. గురువారం జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ఆవరణలోని ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓలు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆంగ్ల మాధ్యమాన్ని ప్రాథమిక స్థాయి నుంచి ప్రారంభించాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థికి ఆంగ్లంలో రాయడం, చదవడం రావాలన్నారు. అనంతరం వారు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని విద్యార్థులకు మెనూ ప్రకారం విందుభోజనంగా వడ్డించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ ఆంగ్లమాధ్యమంలోని కొన్ని ప్రశ్నలను విద్యార్థులపై సంధించారు. వాటికి విద్యార్థులు కూడా ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడంతో డీఈఓలు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లీకేజీతో తాగునీరు వృథా


లీకేజీతో చిన్నపాటి కుంటను తలపిస్తున్న పైపులైన్ ప్రదేశం

రేణిగుంట: ప్రతి నీటి చుక్కనీ ఆదా చేద్దామని ప్రభుత్వం నీటి వనరుల పరిరక్షణకు కృషి చేస్తున్నా మరోవైపు ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదనడానికి ఇక్కడ ఉన్న చిత్రమే ఉదాహరణ. రేణిగుంట మండల కేంద్రం చెక్ పోస్టు సమీపంలోని అన్నానగర్‌లో కొన్నిరోజులుగా పైపులైన్ లీకేజీతో ఎంతో తాగునీరు వృథా అవుతోంది. దాదాపు పదిరోజులుగా నీరు లీకేజీ అవుతున్నా, దీనికి అడ్డుకట్ట వేసిన పాపానపోలేదని స్థానికులు మండిపడుతున్నారు. లీకేజీతో నీళ్లు రోడ్డు పొడవునా ప్రవహిస్తుండడంతో దాన్ని కాలువలోకి మళ్లించినట్టు అక్కడి ప్రజలు చెప్పారు. ఈ వృథా నీటితో పాదచారులు నడవలేకపోతున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు నీరు కూడా కలుషితమవుతున్నాయని అన్నానగర్ కాలనీవాసులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

రామయ్య అక్షింతల కలశాలకు పూజలు


కలశాల ఊరేగింపులో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు

రేణిగుంట(శ్రీకాళహస్తి): అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజా అక్షింతల పవిత్ర కలశాలను పట్టణంలోని కొత్తపేట శ్రీరామమందిరంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శ్రీరామ కీర్తనలను ఆలపించారు. పూజల అనంతరం అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. సభ్యులు మాట్లాడుతూ అయోధ్య శ్రీరామమందిరంలో రాముల వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ట ఈనెల 22న ప్రారంభం కావడం శుభపరిణామన్నారు. అదే రోజు, అదే సమయంలో ప్రజలందరూ ఇళ్లలో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పండుగ జరుపుకోవాలన్నారు. గరికపాటి రమేష్, మంగిరెడ్డి, సుబ్బు, కన్నా వెంకటేశ్వర్లు, వాసు, ఢిల్లీ, అమరనాథ్, శ్రీరామమందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీలకు పట్టాల పంపిణీ


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం: మండలం భూమిలేని ఎస్సీ మహిళలకు 98 మందికి ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ల్యాండ్ పర్చేజ్ స్కీం కింద ఒరిజినల్ సేల్ డీడ్, మార్టిగేజ్ డీడ్, తనఖా విడుదల ఆర్డర్లను పంపిణీ చేశారు. ఈ భూములపై ఎస్సీలకు ఇకపై సంపూర్ణ హక్కులు ఉంటాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్, తహసీల్దార్ ప్రసన్న కుమార్, సచివాలయ కన్వీనర్ దేశప్పన్, నాయకులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ

నాగలాపురంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ఆదిమూలం భూమి పూజ చేశారు. టవర్ క్లాక్ కూడలి వద్ద పాత చావడి భవనాన్ని కూల్చి వేశారు. ఈ స్థానంలో పంచాయతీ తీర్మానం మేరకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని తీర్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

నేటి నుంచి ఆరోగ్య సురక్ష శిబిరాలు

వరదయ్యపాళెం: మండలంలో శుక్రవారం నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరాలు మార్చి 22 వరకు జరుగుతాయన్నారు. శుక్రవారం వరదయ్యపాళెం-2 సచివాలయానికి సంబంధించి స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో, 9న సంతవేలూరు సచివాలయానికి సంబంధించి స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో, 19న మత్తేరిమిట్ట సచివాలయానికి సంబంధించి స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో, 23న సీఎల్ఎన్‌పల్లె సచివాలయానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో, ఫిబ్రవరి 2న ఇందిరానగర్ సచివాలయానికి సంబంధించి ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో, ఫిబ్రవరి 9న బత్తలవల్లంకు సంబంధించి స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో ఫిబ్రవరి 16న పెద్ద పాండూరు సచివాలయానకి సంబంధించి సమీపంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 23న కడూరు సచివాలయం ప్రాంగణంలో, మార్చి 1న కాంబాకం సచివాలయం ప్రాంగణంలో, మార్చి 15న కారిపాకం సచివాలయానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో, మార్చి 22న మరదవాడ సచివాలయ ప్రాంగణంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి


ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులందరు తప్పనిసరిగా తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధి కారి భారతి తెలిపారు. ఆమె గురువారం కనమనంబేడు, పెద్దపాలేడు, చిన్నపాలేడులో క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ బుకింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటే వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాలు సమయంలో పంట నష్ట పరిహారం, మద్దతు ధరపై పంటల కొనుగోలు వంటి ప్రభుత్వ ప్రోత్సాహకాలకు అర్హులు అవుతారని ఏఓ తెలిపారు. అలాగే పీఎం కిసాన్, ఈకేవైసీ, ఆర్బీకేలలో ఎరువుల విక్రయం తదితరాలను వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.